గ్యానికి ఇంకొక దౌర్భాగ్యం తోడైనప్పుడు ఇలాంటి సామెతలు చెప్పడం కద్దు

ఉదా॥ 'చెప్పకు చెప్పకు నాకు సిగ్గయ్యీనిఁకనేల
నొప్పిసేసెనాతఁడింత నొచ్చితినేను
కప్పినఁ బోవుసేఁతలు కాలిన పుండ్ల
నుప్పులు చల్లక తలరోసతులు (12-38)

7. చిచ్చు కౌగిలించు కొంటే చిమిడించకుండునా:- వస్తువులను దహించి వేయడం చిచ్చు స్వభావం. అలాంటి చిచ్చును కౌగిలించుకొంటే భస్మం అవడం కాక వేరే ఉండదని అర్థం. దుష్టసాంగత్యం వల్ల కానీ అధర్మమైన పనుల వల్ల గానీ చెడు ఫలితాలు తప్ప మంచి ఫలితాలు అసంభవమని సూక్ష్మార్థం.

ఉదా॥ 'చిచ్చు గౌఁగిలించుకొంటే చిమిడించకుండునా
గచ్చుఁబర స్త్రీల పొందు కాంచకుండునా'
(8-273)

8. విత్తొకటి పెట్టితే వేరొకటి మొలచునా :-

ఏ గింజలను నాటితే వాటికి తగిన మొలకలే వస్తాయి కానీ వేరేవి మొలవవని అర్థం. అంటే ప్రయత్నమెంతో ఫలితమూ అంతే ఉంటుందనడానికి పిండెంతో నిప్పటి అంతే, పని ఎంతో కూలి కూడా అంతే, మొదలైన సామెతలను వాడతారు.

ఉదా॥ 'విత్తొకటి వెట్టితేను వేరొకటి మొలచునా
యెత్తిన శ్రీహరి నీవే యీడేర్చవయ్యా'
(9-189)

9 కలగన్న చోటికి గంపె యెత్తినయట్లు :- కలలో కనపడిన వస్తువు వుండే స్థలానికి గంపతో సంసారాన్ని ఎత్తుకొని పోవడం. అంటే అసంభావ్యమైన దానికి ఆశపడడం అని అర్థం.

ఉదా॥ 'కలగన్నచోటికి గంప యెత్తినయట్లు
అలవు మీరినదెట్లనమ్మా' (3-449)

10. శిరసుండ మోకాలికి శేస వెట్టుట :- శరీర భాగాల్లో అత్యున్నతమైన శిరస్సుపై అక్షతలు చల్లకుండ మోకాలిపై చల్లటం అవివేకమని అర్థం.

ఉదా॥ 'శిరసుండమోకాల శేస యేఁటికి
సరసములాకె పైనే చల్లరాదా నీవు'(25-441)

11. ఈరు దియ్యఁబేను వచ్చుట :- ఈరు తీస్తున్నప్పుడు పేను కూడా రావడం అంటే పని చేస్తున్నప్పుడు దానికి విరుద్ధమైన ఫలితమో లేక అనుకున్న దాని కన్నా ఎక్కువ ఫలితం రావడమో జరిగిందని అర్థం.

ఉదా॥ 'ఈరు దియ్యఁబేను వచ్చునేమనఁగా నెట్లవునో
వూరకుండు టే చాలు వొద్దు సుమ్మీ బాసలు
(25-324)

ఈ విధంగా వైష్ణవ మత సిద్ధాంతాలను సామాన్య ప్రజల మనస్సులకు సూటిగా హత్తుకొనేటట్లు ప్రచారం చేయదలచి ఆంధ్రుల ప్రత్యేకపు సొత్తు అనదగిన సాధారణమైన జాతీయాలను, సామెతలనేకాక విలక్షణమైన వాటిని కూడా ప్రయోగించి తెలుగు భాషలోని సజీవత్వాన్ని తేట తెల్లం చేసిన ప్రజాహితకారి అన్నమయ్య.

ఎస్. వి. యూనివర్శిటీ ఉమెన్స్
హాస్టల్
తిరుపతి - 517502.